కబ్జా కోరల్లో వాగు స్థలం

- నెత్తకుప్పంలో అధికారపార్టీ నేతల దందా
- స్పందించని రెవెన్యూ అధికారులు
- చురుకుగా సాగుతున్న భవన నిర్మాణాలు
- తప్పుడు నివేదికలతో స్పందన ఫిర్యాదు క్లోజ్

ప్రజాశక్తి- రామచంద్రపురం

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాల్సిన రెవెన్యూ అధికారులు కళ్లముందే లక్షలు విలువ చేసే వాగు పొరంబోకు స్థలాలు (ప్రభుత్వ భూములు) కబ్జా అవుతున్నాయి. గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులు స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా మండల రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం వల్ల కబ్జాదారులైన వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలంలో చురుకుగా భవన నిర్మాణాలు సాగిస్తున్నారు. మా కబ్జాలను అడ్డుకుంటే.. మీ అంతుచూస్తాం, ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామంటూ కబ్జాదారులు పలువురిని బెదిరిస్తున్నారు. స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండలు చూసుకొని అటు అధికారులు, ఇటు ఫిర్యాదుదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. విలువైన ప్రభుత్వ భూమి కావడంతో భారీస్థాయిలో ముడుపులు చేతులు మారాయని ప్రజలు బహిరంగంగా విమర్శించుకుంటున్నారు. జగనన్నకు చెబుదాం (టోల్ ఫ్రీ నెంబర్1902) ఫిర్యాదు పై జిల్లా ఉన్నతాధికారులకు స్థానిక తహసిల్దార్ తప్పుడు నివేదికలతో ఫిర్యాదును ఆన్‌లైన్‌లో మూసి వేశారని, ఫిర్యాదుదారులు 16వ తేదీన కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్‌సి పురం రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు.

రామచంద్రపురం మండలం నెత్తకుప్పం గ్రామంలో తిమ్మరాజుపల్లి, అనుపల్లి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వాగు పరంబోకు స్థలం కబ్జాకోరల్లో చిక్కుంది. నెత్తకుప్పం రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 188 వాగు పొరంబోకు స్థలాన్ని స్థానిక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి, చోటా నాయకులు కలసి కబ్జా చేసి చురుకుగా భవన నిర్మాణాలను సాగిస్తున్నారు. కానీ రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను కబ్జా నుండి రక్షించాల్సింది పోయి రాజకీయ ఒత్తులకు తల్లొగ్గి, కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సర్వే నెం : 188 | పూర్తి విస్తీర్ణం : 23.6

సాగుకు పనికి రాని విస్తీర్ణం : 23.6

సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 0.0

భూమి స్వభావం : ప్ర.త్వభూమి

శిస్తు (రూ.) : 0.0 | భూమి వివరణ : వాగు పొరంబోకు

జల ధారము : -- | ఆయకట్టు విస్తీర్ణం : 0.0

ఖాతా నెంబరు : 20001202

అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 23.6

పట్టాదారు పేరు వాగు (తండ్రి/భర్త పేరు) : (వాగు)

అనుభవదారుని పేరు వాగు (తండ్రి/భర్త పేరు) : (...)

అనుభవ స్వభావం : unknown

రిమార్కులు :



అర్జీ రశీదు

Spandana Monday-Tirupati

Your Spandana Request No. (YSR#)	TPT202307314484	అర్జీ నమోదు తేది	31-07-2023
అర్జీ విభాగము	Revenue (Ccla)-->Land Grabbing->Action Against Land Grabbing		
పేరు	N CHINNAKKA	ఫోను	6309647393
జిల్లా	Tirupati	మండలము	Ramachandrapuram
గ్రామ సచివాలయము	NETHAKUPPAM-(R), 11090205	ప్రస్తుత నివాసం	1-136, 1-136, NETHAKUPPAM-(R), 11090205, Ramachandrapuram, Tirupati
పరిష్కరించు అధికారి	TAHSILDAR, RAMACHANDRAPURAM		
గడువు	60 Day(s)	పరిష్కరించు గడువు తేది	29-09-2023
ఎన్రోల్మెంట్ ఆపరేటర్	ఆపరేటర్-3, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, తిరుపతి		

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1902 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను చేసి YSR# చెప్పగలరు.

16న ఆర్‌సిపురం రెవెన్యూ అధికారులపై స్పందనలో ఫిర్యాదు చేస్తున్న స్థానికులు, ఫిర్యాదు చేసిన ఫిర్యాదులు, రసీదులు, కబ్జాకు గురైన వాగు స్థలం

కబ్జాకు గురైన వాగు పొరంబోకు స్థలంకు ఎలాంటి ఇంటి పట్టాలు కూడా మంజూరు చేయలేదు. కానీ బోగస్ ఇంటి పట్టాలను తయారుచేసి వాటిని అడ్డం పెట్టుకొని రూ.20లక్షల విలువైన ప్రభుత్వభూమి కబ్జా చేసేసారు. వాగు స్థలం కబ్జాపై స్పందన కార్యక్రమంలో జూలై 31, సెప్టెంబర్ 11వ తేదీలలో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశామని గ్రామస్తులు తెలిపారు. స్పందన ఫిర్యాదులను కూడా లెక్కచేయకుండా ఆక్రమణదారులకు అధికారులు అండదండలు అందజేస్తున్నారని స్థానికప్రజలు బహిరంగ చర్చించుకుంటున్నారు. వాగు కబ్జాకు కావడంతో భారీ వర్షాలు వస్తే వర్షపు నీరు మొత్తం రోడ్లు భవనాల శాఖ రోడ్డుపై నిలిచిపోతాయి. రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతుంది. కబ్జాకు గురైన వాగు పొరంబోకు స్థలంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మించాలని గతంలో నిర్ణయించారు. కానీ రెవెన్యూ అధికారులు విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడ లేకపోతున్నారు. దీనికి కారణం రాజకీయ ఒత్తిల్లె ప్రధాన కారణమని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని.. 16వ తేదీ జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు, ఆర్‌సిపురం రెవెన్యూ అధికారులపై స్థానికులు ఫిర్యాదు చేసామని తెలిపారు. జిల్లా అధికారులైన స్పందించి వాగు పొరంబోకు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ భవనాలను అడ్డుకొని కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని స్థానికుల కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం : తహశీల్దార్

నెతకుప్పం రెవెన్యూలోని సర్వేనెంబర్ 188 వాగు పొరంబోకు స్థలం కబ్జాకు గురైన విషయం నాదష్టికి వచ్చింది. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని అక్రమణదారులను హెచ్చరించాను. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, నిర్మించిన భవనాలను కూడా ఎక్స్కావేటర్ (జెసిబి) సహాయంతో కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షిస్తాం

- జి.చిన్న వెంకటేశ్వర్లు, తహశీల్దార్

శ్రీవారిసేవలో ఏపీ రాష్ట్ర గవర్నర్

స్వర్ణరథంపై దేవదేవుడు

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఉదయం 7.15 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప బంగారుతేరులో పయనిస్తూ, భక్తుల్ని తన కపాకటాక్షాలతో అనుగ్రహించాడు. మంగళవాయిద్యాల నడుమ తిరు మాడవీధులలో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి స్వర్ణరథన్ని లాగారు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో సదా భార్గవి, సివిఎస్వో నరసింహ కిషోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, విజివో బాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ఏపీ రాష్ట్ర గవర్నర్

తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టీటీడీ ఈవో ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఎవి.ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ సాదరంగా అహ్వానించగా, అర్చక బందం 'ఇస్తికఫాల్' ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఎస్.అబ్దుల్ నజీర్ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్, ఈవో తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని, 2024 టీటీడీ క్యాలెండర్లు డైరీలు అందించారు. డెప్యూటీ ఈవోలు లోకనాథం, విజివో బాలిరెడ్డి పాల్గొన్నారు.

శాశ్వత ధ్రువీకరణ పత్రాలు

ఎప్పుడైనా చెల్లుబాటు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసి సామాజిక వర్గాలకు విద్య, ఉద్యోగం ఇతర అవసరాలకు కులధ్రువీకరణ పత్రాలు చాలా కీలకం. అయితే వీటి జారీ ఇప్పటివరకు సవాలక్ష నిబంధనల కారణంగా ఆయా వర్గాల వారు ఇబ్బంది పడుతుంటారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో సడిలింపులు తీసుకువచ్చింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన వారికి ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అందజేస్తుంది.

ఒకసారి కులధ్రువీకరణ పత్రాన్ని పొందితే దానిని శాశ్వత పత్రంగా పరిగణిచాలంటు అన్ని ప్రభుత్వశాఖలకు ఎంఎస్ నెంబర్469ను ఆదాయ ధ్రువీకరణ పథకాలకు సంబంధించి జీవో ఎంఎస్ నెంబర్484ను ప్రభుత్వం జారీ చేసిన్నట్లు సచివాలయ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం జారీచేసిన కులధ్రువీకరణ పత్రాలకు సంబంధింత డేటాబేస్ మొత్తం మీసేవా, ఎపి సేవ కేంద్రాలలో ప్రభుత్వం సర్టిఫికెట్‌ను ఎలాంటి విచారణ మళ్లీ జారీ చేసేలా కొత్త నిబంధనలు రూపొందించారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీకి సచివాలయాల పరిధిలోని ఆరుదశల తనిఖీ సరిపోతుందని స్పష్టం చేశారు.

ఇలా పనిచేస్తుంది...

ఒకసారి కులధ్రువీకరణ పత్రం ఎపుడైనా జారీచేసిన్ననట్లయితే సంబంధిత లబ్ధిదారుడు గతంలో జారీ చేసిన సర్టిఫికెట్‌ను ప్రభుత్వ శాఖలకు సమర్పించిన్నపుడు ప్రభుత్వం శాఖలు మరలా తాజా సర్టిఫిట్ తీసుకురమ్మని అడగకుడదు. ఆ సర్టిఫికెట్ జీవిత కాలంగా అంటే శాశ్వత కులధ్రువీకరణ పత్రం రూపంలో చెల్లుబాటువుతుంది. అలాగే మీసేవ ద్వారా గతంలో కులధ్రువీకరణ పత్రం పొందిన వారికి ఏ క్యాటగిరి సేవగా తక్షణమే తాజా ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం తిరిగి తహశీల్దార్ లేదా ఇతర అధికారులు విచారణ చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ లబ్ధిదారుడు తండ్రి లేదా సోదరులు ఎవరైనా గతంలో కులధ్రువీకరణ పత్రం పొంది ఉంటే వారి బంధుత్వం ఇప్పుడు వేరుగా ఉందా లేదా నిర్ధారించుకోవడానికి పౌరసరఫరాల శాఖ డేటాబేస్ ద్వారా రేషన్‌కార్డు డేటా భద్రపరిచే డేటాబేస్ ద్వారా ఈకేవైసి పూర్తయితే, ఒకే కుటుంబంలో ఉన్నట్లయితే విచారణ లేకుండానే వెంటనే సర్టిఫికెట్ జారీచేయాల్సి ఉంటుంది.

ఒకవేళ ఈకేవైసి పెండింగ్‌లో ఉన్నవారు వెంటనే గ్రామ,వార్డు సచివాలయాల్లో దాని పూర్తి చేసి సర్టిఫికెట్‌ను పొందవచ్చు. ఆదాయ ధ్రువీకరణ ఆరు దశల వెరిఫికేషన్ సరిపోతుంది. సంక్షేమ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇతర రాయితీలు ప్రభుత్వం ఆదాయ ధ్రువీకరణ ప్రాతిపదికను అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

ఒరిజినల్ పాతే అదే నెంబర్ కొత్తది..

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. ఈక్రమంలో కులధ్రువీకరణ పత్రాన్ని ఒకసారి పొందితే చాలు దానిని శాశ్వత పత్రంగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలోనే ప్రజలు పొందిన సర్టిఫికెట్ ఎక్కడైనా పొగొట్టుకుని ఉంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఇందుకు గతంలో పొందిన సర్టిఫికెట్ నకలు ఉంటే దానిని తీసుకెళ్లి సచివాలయం, మీసేవ కేంద్ర, సీఎస్సీ సెంటర్‌లో చూపితే అదే నెంబర్ కొత్త సర్టిఫికెట్ వెంటనే అందజేస్తారు.

ఆశాలపై వేధింపులు తగదు: సీఐటీయూ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : పని పేరిట ఆశా వర్కర్లను వేధించడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య సూచించారు. సెలవు పెడితే జీతాలు ఆపేయడం, రాత్రి డ్యూటీలు చేయకుంటే ఇంటికి పంపుతామని బెదిరించడం మానుకోవాలని హెచ్చరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తొట్టంబేడు ప్రాథమికఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లను వైద్యాధికారిణి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ సేవకులైన ఆశా వర్కర్లను పని పేరిట పీహెచ్సీలో రాత్రిళ్ళు విధులు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. రాత్రి డ్యూటీలు చేయలేమని చెప్పే ఆశా వర్కర్లను ఇంటికి పంపిస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఆశా వర్కర్లు కేవలం సహాయకులు మాత్రమేననీ, వారికి పీహెచ్సీలో రాత్రి డ్యూటీలు వేయడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా ఆశా వర్కర్లకు అత్యవసర పరిస్థితుల్లో సెలవు కూడా ఇవ్వకుండా వైద్యాధికారిణి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే సెలవు పెట్టారన్నా కక్షతో తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు, పెద్దకన్నలి పంచాయతీ ఆశా వర్కర్లైన చంద్రకళ, నాగభూషణమ్మలకు సెప్టెంబర్ నెల జీతాలు వేయకుండా ఆపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఆశా వర్కర్లు సెలవులు పెట్టుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించినా కూడా తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల పట్ల ఆమె తీరు మారకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, పట్టణ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రధాని ఫోటో పెట్టకపోతే ఏపీకి నిధులు ఆపేస్తాం...

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడి

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వివిధ సంక్షేమ పథకాలకు, అభివద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టకపోవడం దారుణమని, ఇలాగైతే రాష్ట్రానికి కేంద్రం నిధులు ఆపేస్తామని కేంద్ర రూరల్ డెవలప్మెంట్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని గాంధీభవన్లో కస్తూరిబా ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ పిసి రాయలు కేంద్ర మంత్రి హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినట్టు పేరు గొప్పగా ప్రచారం చేసుకుంటా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అభివద్ధి పథకంలో కేంద్రం ఇచ్చిన నిధులేనని అన్నారు. ఇకపై అలాగే వివరిస్తే రాష్ట్రానికి నిధులు నిలిపివేయాల్సిన వస్తుందని హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టులో బిజెపి పాత్ర లేదని, అది రాష్ట్ర ప్రభుత్వ పాత్రతో జరిగిందన్నారు. నరేగావ్ పథకంలో రాష్ట్రానికి ఎక్కువ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, కస్తూరిబా ట్రస్ట్ ఛైర్మన్ పిసి రాయలు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్తూరిబా ట్రస్టు ఛైర్మన్ పిసి.రాయలు, బండి మధుసూదన్ రెడ్డి, రుద్రరాజు శ్రీదేవి, ఉదయగిరి కష్ణమూర్తి, బిజెపి నాయకులు ఉన్నారు.

ఆడినా, ఓడినా రికార్డుల్లో ఉంటారు..

రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి

విద్యార్థులకు చదువెంత ముఖ్యమో ఆటలూ అంతే ముఖ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం స్థానిక కేవీకే మైదానంలో 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీవితంలోగానీ, విద్యలోగానీ, ఆటల్లోగానీ గెలుపుకోసం పోరాడుతూనే ఉండాలన్నారు. తప్పులు సరిదిద్దుకుంటూ వెళితే అందరూ ఛాంపియన్లే అన్నారు. నేడు ఉన్నత స్థానంలో ఉన్నవారందరూ ఎప్పుడో ఒకసారి ఓటమిని చూసినవారే అన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆడినా, ఓడినా రికార్డుల్లో ఉంటారని గెలిస్తేనే చరిత్రలో ఉంటారన్నారు. అమ్మానాన్న చాటున గారాబంగా పెరిగేవారు చిన్న ఒత్తిడిని కూడా తట్టుకోలేరన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను, సహకరించే గుణాన్ని, బాధ్యతను అలవరుస్తుందన్నారు. ఉద్యోగ అవకాశాలను కల్పించడంతోపాటు, ధైర్యంగా పదిమందికి స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. అందుకే క్రీడలను తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానన్నారు. పోరాడితే పోయేదేమీ లేదని ప్రయత్నం ఫలితాన్ని ఇస్తుందన్నారు. అందరూ చక్కగా ఆడి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై రాష్ట్రానికి పేరుప్రతిష్టలు తేవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకటరావు మాట్లాడుతూ క్రీడలకు ప్రస్తుత ప్రభుత్వం, క్రీడాశాఖ ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ఇటీవల ఆసియా క్రీడల్లో గెలుపొందిన వారికి, జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించిందన్నారు. ఇందుకుగాను మంత్రి ఆర్కే రోజాకు కతజ్ఞతలు తెలిపారు. తొలుత ప్రారంభోత్సవ వేడుకలకు విచ్చేసిన మంత్రి ఆర్కేరోజాను క్రీడాభివందనంతోను ఎన్‌సీసీ సెల్యూట్‌లతోను పుష్పవర్షంతో నిర్వాహకులు ఆహ్వానించారు. పోటీల ఆర్గనైజింగ్ ఛైర్మన్ అయిన మంత్రి జ్యోతిప్రజ్వలన, పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకంతో పాటు, రాష్ట్ర, జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ పతాకాలను ఎగురవేశారు. అనంతరం 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను ఆయా జిల్లాల విశిష్ఠతను వివరిస్తూ ఆహ్వానించగా వారు పెరేడ్ నిర్వహిస్తూ మంత్రికి గౌరవ వందనం చేస్తూ ముందుకు సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమావేశంలో నాయకులు, క్రీడాకారుల సమక్షంలో మంత్రి భర్త ఆర్కేసెల్వమణి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, డీఈవో శేఖర్, సీఈవో సెట్విన్ మురళీకష్ణారెడ్డి, తిరుపతి సిద్దార్థ, రాయలసీమ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆనందరెడ్డి, జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షులు గోపి, జాయింట్ సెక్రటరీ, సుధాకర్, డీఎస్ఏ చీఫ్‌కోచ్ బాలాజి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, శాప్‌కోచ్ బాబు, నగరి బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ ఎంవీ రవిబాబు, అధ్యక్షులు మోహన్, కార్యదర్శి నిజాం, పీడీలు చంద్ర, మణి, ప్రకాష్, లోకేష్, హేమాద్రి, సుబ్బు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే ధ్యేయం

- పల్లెలకు మౌలిక వసతులు కల్పనకు కృషి
- జిపిఓ ఆదం రాజశేఖర్‌రెడ్డి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తే, లక్ష్యాలను అందుకునేందుకు నిత్యం కృషి చేస్తున్నామని, ప్రతి పల్లెకు మౌలిక వసతులు కల్పనకు కట్టుబడి ఉన్నామని జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఆదం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలువిషయాలు వెల్లడించారు.

ప్రజాశక్తి: తిరుపతి కొత్త జిల్లాలో మీరు గమనించిన అంశాలు?

జిపివో: తిరుపతి కొత్త జిల్లాలో నెల్లూరు నుంచి విడిపోయిన కొన్ని మండలాలు కలిశాయి. ఎక్కువుగా షీ సోర్సు ఉంది, 6 పంచాయతీలు పూర్తిగా దానికి కిందకి వస్తోంది. అక్కడ అబివృద్ధి చేయాలంటే కొంత ఇబ్బందులు ఉన్నాయి. ఏపని చేపట్టాలన్నా ప్రత్యేక అనుమతులు అవసరం, తడ సమీపంలోని ఇరకం పంచాయతీ ఒక దీవి. తడ నుంచి బోటులో 10 నిమిషాలు ప్రయాణించాలి. అక్కడ కూడా ప్రత్యేకంగా కొత్త పనులు చేపట్టలేకపోతున్నాం. కనీసం అక్కడ రోడ్లు కూడా నిర్మించేందుకు అనుమతి ఇవ్వరు.

ప్రజాశక్తి : కృష్ణపట్టణం పోర్టు ద్వారా ఆదాయ వనరులు ఉన్నాయా?

జిపివో: కృష్ణపట్టణం పోర్టు జిల్లాకు ఆనుకునే ఉంది. సరిగ్గా పోర్టు భూముల సమీపం వరకు జిల్లా విభజన జరిగింది. పోర్టుకు సంబంధించిన అన్ని ప్రాంతాలు, భూభాగం మొత్తం నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. కనుక తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా ఆదాయ వనరులు పోర్టు ద్వారా వచ్చే అవకాశం లేదు.

ప్రజాశక్తి : శ్రీసిటిలోని గ్రామాల పరిస్థితి?

జిపివో: శ్రీసిటి మంచి పారిశ్రామిక వాడ. దీని వల్ల లక్షలాది మందికి ప్రత్యేక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతోంది. శ్రీసిటి పరిధిలో కొన్ని గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామాలున్నాయి. అక్కడ అభివృద్ధి రోడ్డు వేయడం, వీధులైట్ల ఏర్పాటు తదితరవన్ని శ్రీసిటి నిర్వహకులే కల్పిస్తున్నారు. ఇంటి పన్ను వసూల్లు మినహా అక్కడ నుంచి పంచాయతీకి ఎలాంటి ఆదాయం రాదు. శ్రీసిటి అభివృది వల్ల సమీపలోని తడ పంచాయతీలో అపార్టుమెంటు నిర్మాణాలు, హోటళ్లు, వివిధ రకాల షాపులు ఏర్పాట్లు పెరిగింది. వీటి ద్వారా పంచాయతీకిక అధిక ఆదాయం వస్తోంది.

ప్రజాశక్తి: జిల్లాలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమాచారం?

జిపివో: కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడురు నాలుగు డివిజన్ పంచాయతీ కార్యాలయాలు, 33 మండలాలు, 486 సెక్రటేరియట్‌లు, 16 మేజరు పంచాయతీలు, 758 మైనర్ పంచాయతీలు కలిపి 774 పంచాయతీలు. 2011 జనాభ లెక్కల ప్రకారం 3982 ఆవాసాలు, 408177 గృహాలు, 14,51,608 మంది జనాభా, 745 మంది సర్పంచ్‌లు, 4021 మంది వార్డు సభ్యులు ఉన్నారు.

ప్రజాశక్తి: 2023-24 నిధులు వివరాలు?

జిపివో: జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,79,76,688 రూపాయలు నిధులు ఇప్పటివరకు ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో తలసరి గ్రాండ్ రూ.57,48,432, సినరేజ్ గ్రాంట్ రూ.2,43,55,528, వృత్తి పన్ను 1,00,06,808, సర్పంచుల గౌరవ వేతనం రూ.2,78,64,000, షెడ్యూల్ కులాల ప్రాంతాల్లో లైబ్రరీ ఏర్పాటుకు రూ.1,920 విడుదలయ్యాయి, వాటిని వివిధ రకాల పనులకు వెచ్చిస్తున్నాం.

విలేకరి : జిల్లాలో జగన్న స్వచ్ఛ సంకల్పం అమలు తీరు?

జిపివో: జిల్లాలో జగన్న స్వచ్ఛ సంకల్పం పథకాన్ని 2021 అక్టోబరు 2న వంద రోజుల ప్రోగ్రామ్‌గా ప్రారంబించాం. ఇందులో బాగంగా ఇప్పటి వరకు 630 గ్రామ పంచాయతీలో సాలిడ్‌వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్‌లను నిర్మించాం. అందులో 599 సాలిడ్ వెల్త్ ప్రాజసింగ్ సెంటర్లో వాడుకలో ఉన్నవి. 2172 మంది క్లాప్ మిత్రులు ప్రతి ఇంటి నుండి తడి, పొడిచెత్త సేకరణ పనులు చేస్తున్నారు. సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్లలో తడి, పొడి చెత్తలు వేరు చేసి, సేంద్రియ ఎరువుగా తయారు చేసి, గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుతోంది. పంచాయతీ కార్యదర్శి వారంలో మూడు రోజులు తప్పనిసరిగా పీల్డ్ విజిట్ చేస్తున్నారు.

ప్రజాశక్తి: మనం-మన పరిశుభ్రతలో సరఫరా చేసిన పరికరాల వివరాలు?

జిపివో: జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలకు గాను 630 పంచాయతీల్లో సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్లను నిర్మించాం. అందులో 599 సెంటర్లు వాడకంలో ఉన్నాయి, కొత్తగా 126 సెంటర్లు మంజూరయ్యాయి, ఇంకా 18 సెంటర్లు మంజూరు కావాల్సి ఉంది. 1560 ట్రై సైకిల్స్, 739 ఇన్సునేటర్స్, 43 డిజిల్ ఆటోలు, 232 ఈ-ఆటోలు, 62 ట్రాక్టర్లను మనం-మన శుభ్రతలో భాగంగా సరఫరా చేశాం.

ప్రజాశక్తి: గ్రామాల అబివృద్ధికి మీరిచ్చే సలహా?

జిపివో: ప్రతిగ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకే అధికార యంత్రాంగం, సిబ్బంది ఉండేది. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను పసిగట్టి వాటిని పరిష్కరింప చేసేందుకే గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ముందు వరసులో నిలపేలా కృషి చేయాలని ప్రతి పౌరుడికి, ప్రతిగ్రామానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగవంతంగా చేర్చేందుకు, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తూ, ప్రతి ఒకరికి తన సహాయ సహకారాలు అందిస్తాను. గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు ప్రతి ఒకరు సహకరించాలి.

గురవయ్య చిత్రపటానికి నివాళి

నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మండలంలోని సికె పురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కుప్పయ్య తండ్రి మరకాలకుప్పం గురవయ్యకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం సర్పంచ్ హరితకుప్పయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరితోపాటు జడ్పిటిసి రమణ, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు నాయుడు కృషి మరువలేనిది

- వైసిపి నేతలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి శ్రీరాములు నాయుడు కృషిని మరువలేమని మాజీ మండల కన్వీనర్, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. ఆదివారం శ్రీరాములు నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. ఆయన మట్లాడుతూ మొట్టమొదటి పార్టీ కన్వీనర్, డిప్యూటీ సిఎం నారాయణస్వామితో కలసి మండలంలో పార్టీని బలోపేతం చేసి పార్టీ విజయానికి కృషి చేసిన వ్యక్తి లేరు అనడాన్ని జీర్ణించుకో లేక పోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, సుబ్రమణ్యం. శివప్రకాష్ మొదలి, రత్నంరెడ్డి, నాగేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలని నిరసనలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చంద్రబాబు అరెస్టు అక్రమమని, ఆయను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌గౌడ, శ్రీనివాసులు, అన్బునాధన్, రవి, బాబు రమేష్, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై లక్ష్మీనారాయణుడు

లక్ష్మీనారాయణస్వామి, అమ్మవార్ల అభిషేక మహోత్సవం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనారాయణుడు హనుమంత వాహనంపై విహరించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేషంగా అభిషేకాలు, అలంకరణ జరిగింది. అధిక సంఖ్య భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ దేవస్థానం అన్నదాన కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అడ్వకేట్ శ్రీధర్, ఆలయ మేనేజరు వెంకటేశులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతగా వ్యవహరించండి

-డిఎస్‌పి రవికుమార్



ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని డిఎస్పి రవికుమార్ పోలీసులకు సూచించారు. ఆదివారం ఎస్ఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ప్రతి ఏటా రికార్డులు తనిఖీ చేయడం జరుగుతుందని అందులో భాగంగానే రికార్డులు పరిశీలించడం జరిగిందని డిఎస్‌పి తెలిపారు. రికార్డుల నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సిఐ సత్తిబాబు, ఎస్ఐ షేక్షావల్లి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి బీజేపీ మోకాలడ్డు: బిఆర్ఎస్ పార్టీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి అభివద్ధికి టీటీడీ నిధులు ఒక శాతం నిధులు తీసుకోకూడదని దేవదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమని, తిరుపతి అభివద్ధికి బిజెపి అడ్డుపడడమే కారణమని టిఆర్ఎస్ నేత ఆర్కాట్ కష్ణప్రసాద్ విమర్శించారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధిపై టిటిడి పాలకమండలి నిర్ణయాన్ని బీజేపీ అడ్డుచెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం శోచనీయమన్నారు. బిజెపికి చిత్తశుద్ధి లేదని, రాజకీయకోణంతో చూస్తున్నారని కేంద్రప్రభుత్వం చేపట్టవలసిన వాటిపై దష్టిపెట్టకుండా కేవలం తిరుపతి అభివద్ధికి టిటిడి నిధులు వస్తే ఎక్కడ తమకు ఇబ్బంది వస్తుందోనని అడ్డుచెప్పడం సబబుకాదని అన్నారు. కేంద్రప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల దేవాలయాలకు, పట్టణాలకు, గుజరాత్‌కు ఖర్చు చేసేందుకు అభివద్ధి చేసేందుకు వెనుకాడడం లేదని, కానీ వీటిపై స్థానిక బిజెపి నాయకులు నోరుమెదపరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ప్రజాశక్తి-తొట్టంబేడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సాయిపూజ సూచించారు. మండలంలోని బోనుపల్లి వైఎస్సార్ యానాది కాలనీలో ఆదివారం రెండోరోజు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని జ్వరపీడితులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. వాతావరణ పరిస్థితుల కారణంగా మలేరియా, డెంగీ, టైపాయిడ్ లాంటి వైరల్ ఫీవర్స్ విజంభిస్తున్నాయని డాక్టర్ సాయిపూజా చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వేడినీరు తాగడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా విషజ్వరాల భారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. అనంతరం కాలనీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి శివకుమార్, సూపర్ వైజర్ ధనమ్మ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు జయంతి, కష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని రాజులపాలెం గ్రామ పంచాయతీ లోని డొంక మార్గంలో నిరంతర విద్యుత్ సరఫరాకు నూతన విద్యుత్ స్తంభాలు ఆదివారం ఏర్పాటు చేశారు. శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పేడు మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాజులపాలెం రమేష్ తోకల సుబ్రహ్మణ్యం, మొరస జగదీష్, పల్లం రాజా వారి సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజుల పాలెం గ్రామస్తులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నిరంతరం అంతరాయం కలిగిస్తున్న విద్యుత్ సమస్య నుండి తమకు ఉపశమనం కలిగిస్తున్న వీరికి కృతజ్ఞతలు తెలిపారు.

టికెట్ ఎవర్ని వరించనుందో.!

- గంగాధర నెల్లూరు శాసనసభ స్థానం 2024 అభ్యర్థిపై నెలకొన్న సందిగ్ధత
- డిప్యూటీ సిఎం ఈ దఫా పోటీలో ఉంటారా..? (లేక) కుమార్తెకు అవకాశమిస్తారా..?
- టిడిపి, జనసేనలో అభ్యర్థిపై తర్జనభర్జన
- కాంగ్రెస్, బిజెపిలలో తెరకెక్కని అభ్యర్థులు

గంగాధర నెల్లూరు నియోజవర్గంలో ఆయా పార్టీలు 2024ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో గ్రామాల్లో జోరుగా ప్రచారాలు చేస్తున్నారు అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు ఊర్లలో చిన్న కార్యక్రమమైనా ఇట్టే వాలిపోతున్నారు. తామంటే తాము అంటూ పోటాపోటీగా వ్యవహరిస్తున్నారు. అంతా భాగానే ఉన్నా రాజకీయ పార్టీలు మాత్రం 2024 ఎన్నికల అభ్యర్థులను ఇంకా ఖరారు చేయనే లేదు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మాత్రం రాజకీయ వేడి మొదలైంది.

ప్రజాశక్తి-వెదురుకుప్పం

నియోజవర్గంలోని మండలాలు
- పెనుమూరు
- గంగాధరనెల్లూరు
- కార్వేటినగరం
- శ్రీరంగరాజపురం
- పాలసముద్రం
- వెదురుకుప్పం



నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గుమ్మడి కుతూహలమ్మ గెలుపొందారు. ఆ తరువాత 2014లో వైసిపి నుంచి కలత్తూరు నారాయణస్వామి గెలుపొందారు. 2019లోనూ గుమ్మడి హరికృష్ణపై అత్యధిక మెజారిటీతో తన అభ్యర్థి స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు నామమాత్రపు పోటీనే ఇచ్చాయి. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నారయణస్వామి డిప్యూటి సిఎంగా ఉన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో మండల, గ్రామ స్థాయి కేడర్‌లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోంది. పార్టీ వ్యవహారాల్లో అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. అయితే రాజకీయ పార్టీలు ఇప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించకపోవడంతో కాస్తంత సందిగ్ధం వ్యక్తమవుతోంది. పార్టీలు ఏ అభ్యర్థిని నియమించినా ఈ దఫా తామే గంగాధరనెల్లూరు స్థానాన్ని దక్కించుకోవాలన్న పంతం మాత్రం వైసిపి, టిడిపి, జనసేన నేతల్లో కనిపిస్తోంది.

ప్రస్తుతం డిప్యూటీ సిఎంగా ఉన్న కళత్తూరు నారాయణస్వామి తప్పుకొని తన కుమార్తె కృపాలక్ష్మిని బరిలోకి దించుతారని ప్రచారం ఉంది. కాగా వైసిపి నుంచే నూకతోటి రాజేష్ సీటు కోసం పావులుకదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నారాయణస్వామి దగ్గర ఇదివరకు పిఎగా పనిచేసిన ఆయన మేనళ్లుడు సుబ్రమణ్యం వైసిపి టికెట్టు ఆశిస్తున్నారని సమాచారం. వైసిపి నుంచి ముగ్గురు పేర్లు తెరమీదకు వస్తుండడంతో అభ్యర్థి ఎవరనేదానిపై కేడర్‌లో తర్జనబర్జన నెలకొందనే చెప్పాలి.

నియోజకవర్గంలో టిడిపి బాధ్యతలను డాక్టర్ థామస్ వ్యవహరిస్తుండగా, జనసేన నుంచి పొన్నా యుగంధర్ ఉన్నారు. ఇటీవల ఇరుపార్టీలు కలిసి పోటీ చేస్తాయని ప్రకటించడంతో అభ్యర్థి ఎవరనేదానిపై ఇరుపార్టీల్లోనూ చర్చనీయాంశంగా ఉంది. ప్రభుత్వంపై తమనదైన శైలిలో ఇరువురూ పోరాటం చేస్తూ కేడర్‌ను ఉత్తేజింపజేసే పనిలో ఉన్నారు. ఇరుపార్టీల నుంచి ఎవరు బరిలో దిగుతారో స్పష్టత రావాల్సి ఉంది. ప్రధాన కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి అలాంటి ఊసే కనిపించలేదు. ఇంతకీ ఎవరెవరు బరిలో ఉంటారనేదానిపై ఆయాపార్టీలు స్పష్టత ఇవ్వాలని పార్టీ శ్రేణుల్లోనూ ఆందోళన కనిపిస్తోంది.

గోవింద భక్తుల సేవంటే తరతరాల పుణ్యమే..

టీటీడీ జేఏసీ అన్నదానంలో బోర్డు సభ్యులు నాగసత్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుమల గోవిందుని భక్తులకు సేవచేయడం అంటే తరతరాల పుణ్యమే అని టీటీడీ బోర్డు సభ్యులు ఎన్.నాగసత్యం అన్నారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ జేఏసీ, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడైన కె.ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జివి.సుబ్బరాజు, సి.అశ్వర్థ నాయక్ కూడా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు ఆంజనేయులు దంపతులు భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. అనంతరం ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం కూడా తమ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. అందులో భాగంగానే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఈ బహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు హాజరై తమ దంపతులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి వెంకటరత్నం, సభ్యులు సుబ్రమణ్యంరెడ్డి, బాలసుబ్రమణ్యం, క్రాంతి, ఎలక్ట్రికల్ విభాగం చెన్నూరు సుబ్రమణ్యం, శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా గంగమ్మ

మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు జరిగాయి. మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. ఈవో చంద్రమౌళి భక్తులకు కావలన ఏర్పాట్ల పర్యవేక్షించారు.

బంగారుపాళ్యం: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వజ్రాల బోయకొండ గంగమ్మకు విశేషంగా అభిషేకాలు జరిగాయి. మహిషాసుర మర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కార్వేటినగరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బంగారమ్మకు విశేష పూజలు చేశారు. దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యాక్షుడు రంగనాధమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్పిళ్లై, భక్తులు పలువురు పాల్గొన్నారు.

దళితుల భూములు లాక్కుంటే సహించం

ప్రజాశక్తి - ఓజిలి: దళితులకు భూమిపై హక్కు కల్పించాలని దళితులకు ఇచ్చిన భూములను లాక్కొని పరిశ్రమలకు కట్టబెట్టాలనే దురుద్దేశంతో అధికారులు దళితులను మోసగిస్తున్నారని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఓజిలి మండలంలోని మాచవరంలో సిపిఎం బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మాచవరంలో దళితులకు కేటాయించిన సర్వే నెంబర్ 207లో సాగుపట్టాలు, డికేటి పట్టాలు ఇచ్చారని ఆ భూములు దళితులు, పేదలు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారని తెలిపారు. ఉన్న ఫళంగా ఇప్పుడు పశువుల మేత సాకుతో వీరి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ అధికారులు చూస్తున్నారని దీనికి సిపిఎం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇదే ప్రాంతంలో క్వారీకి అనుమతులు ఇచ్చి తవ్వకాలు చేస్తున్నవారికి వర్తించని పశువుల మేత పోరంబోకు భూములు దళితులకు ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూములు కల్పిస్తామని ఒకపక్క ప్రచారం చేస్తూ మరొకపక్క పేదలకు ఇచ్చిన భూములు లాక్కొని పరిశ్రమాధిపతులకు కట్టబెట్టాలని చూస్తున్నారని దీనిపై సిపిఎం నిరుపేదల పక్షాన నిలబడి భూ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయుడుపేట మండల కార్యదర్శి శివకవి ముకుంద, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెంగయ్య, ఐద్వా నాయకులు చంద్రకళ, మురళి, గురవయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పాల కలశాలతో ప్రదర్శన

ప్రజాశక్తి-వి.కోట: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వి.కోటలో మహిళలు 1808పాల కలశాలతో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి దుర్గామాత ఆలయం వరకు ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. దుర్గామాతకు కలశాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే, వి.కోట ఎంపిపి యువరాజ్ దంపతులు పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా వైద్యశాల సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కోట:

కోట పట్టణంలోని ముస్లిం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస ప్రజా వైద్యశాలను ఆదివారం ఉదయం ఎంపీపీ వినోద్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన వినోద్ రెడ్డిని వైద్యశాల సిబ్బంది ఆహ్వానించి శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్ రెడ్డి ఆసుపత్రి ద్వారా అందించే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ప్రజావైద్యశాల ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. వైద్యశాల ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడమే కాకుండా, రోగుల పట్ల ప్రేమతో, సేవా దృక్పథంతో, స్నేహ పూరితంగా వ్యవహరించాలని ఆసుపత్రి వైద్యులు శ్రీనివాసులుకు సూచించారు. ఇలాంటి ప్రజా వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వినోద్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ అహ్మద్, షేక్ ఇక్బాల్, షేక్ కరీముల్లా, షేక్ పినా పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో గున్నం సేవా ట్రస్ట్ భరోసా లో భాగంగా వృద్ధులకు నిత్యా వసర సరుకులు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారం మరువలేని దన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అల వరచుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ రామిరెడ్డి ప్రజేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకరణలో విజయదుర్గ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు పట్టణంలోని శ్రీ సాయి సత్సంగ నిలయం విజయదుర్గ ఉప పీఠంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీ సాయి సత్సంగ నిలయం విజయదుర్గ ఉప పీఠంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం మహా పూర్ణాహుతి వైభవంగా నిర్వహిం చారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విజయదశమి సందర్భంగా 23వ తేదీ సోమవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు రూరల్, చిల్లకూరు:

మనస్థాపానికి గురై బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిల్లకూరు మండలంలోని మిక్స్ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు లోని మిక్స్ కాలనీకి చెందిన భార్గవి(17) స్థానిక జడ్‌పీ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి చదువుకుంటోందని, దసరా సెలవులు కావడంతో బాలిక ఇంటి వద్దనే ఉంటోంది. దీంతో బాలిక తండ్రి ట్యూషన్ కి వెళ్లాలని మందలించాడని తెలిపారు. అయన గూడూరు లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇంటికి వచ్చే సరికి బాలిక ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించిందన్నారు. అనంతరం మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మృతితో మిక్స్ కాలనీ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వైభవంగా శ్రీకల్యాణ వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని ప్రాత:కాల సమయంలో సుప్రభాతంతో మేల్కొలిపి దైనందిన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేసి రథంపై కొలువు దీర్చారు. బ్రహ్మరథంపై కొలువు దీరిన శ్రీ, భూ సమేత మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు బ్రహ్మరథానికి ప్రత్యేక పూజలు చేశారు. మాడ వీధులలో శ్రీవారి బ్రహ్మరథానికి ముందు భజన బృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతో అలరించాయి. శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై కల్కీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రతి సమస్యకూ గ్రీవెన్స్ నెంబర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు అర్జీల రూపంలో ఇస్తున్న ప్రతి సమస్యకూ గ్రీవెన్స్ నంబర్ ఇస్తామని తద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలోని 9వ వార్డు (యానాది సెంటర్, పీవీ రోడ్, హరహర బావి, ఫైర్ స్టేషన్, బ్రాహ్మణ వీధి, గౌండ్ల వీధి, సీతాలమ్మ గుడి వీధి, దక్షిణ కైలాస నగర్)లో పర్యటించారు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. లబ్ధిదారుల వద్దకు వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా?' అని అడుగుతూ ముందుకు సాగారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు పవార్, ముత్యాల పార్థసారథి, రామచంద్రారెడ్డి, రఘు నాయుడు, అల్తాఫ్, పాలమంగళం రవి, పవన్, శోభన్ నాయుడు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల్లో పవిత్ర రెడ్డి

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని కోబాక గ్రామంలోని కోబాక గంగమ్మని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి దేవీ నవరాత్రుల సందర్భంగా ఆదివారం దర్శించుకున్నారు. కోబాక నాయకులు గాలి గుణశేఖర్ నాయుడు, కోబాక సర్పంచ్ బుజ్జమ్మ, చంగల్ రాయులు , రవి, శేఖర్, గౌరీ ఎంపీటీసీ, గుణశేఖర్, వెంకటరమణ, రమేష్, రాఘవులు, ఈశ్వరయ్య కలిసి ఆహ్వానం పలికి దర్శనం చేయిం చారు. పవిత్ర రెడ్డి రాక తో కోబాక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- ఏర్పేడు : మండలంలోని పాపానాయుడు పేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ సందర్భంగా సహస్రనామ, కుంకుమార్చన, కన్య పూజ (సుహాసిని) దుర్గ అష్టోత్తర సహస్రనామం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా మండలి, పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సెల్వమణి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా భర్త ఆర్‌కె సెల్వమణి 60వ జన్మదిన వేడుక లు నగరి నియోజకవర్గ ప్రజలు మధ్య ఆదివారం ఘనం గా నిర్వహించారు. పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఎ హరి, వైస్ చైర్మన్ డి జయప్రకాష్, వైసిపి నాయకులు మోహన్ రెడ్డి కలసి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి భర్త ఆర్‌కె సెల్వమణి ప్రతి సంవత్సరం జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు.

నాగు పాము హల్‌చల్.. పట్టివేత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల పరిధిలోని కొండల చెరు వు గ్రామంలో ఓ ఇంటి వంట గదిలో నాగుపాము హల్‌చల్ చేయడంతో ఇంటి యజమానులు, మహిళలు భయాందో ళనకు గురయ్యారు. వెంట నే సంబంధిత అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే శ్రీకాంత్‌కు సమాచారం అందించడంతో కొండల్ చెరువు గ్రామానికి వెళ్లి చాకచక్యంగా వంట గదిలో ఉన్న పామును పట్టుకోవడంతో ఇంటి యజమానులు, మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న నాగు పామును అటవీ ప్రాంతం లోకి తీసుకువెళ్లి విడిచి పెట్టారు. సందర్భంగా స్నేక్ శ్రీకాంత్ మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే పాములు రావని తెలిపారు.

చాముండేశ్వరికి మోహిత్ రెడ్డి సారె సమర్పణ

ప్రజాశక్తి - క్యాంపస్ : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రధానమైన దుర్గ అష్టమి పర్వదినాన తుమ్మలగుంట శ్రీ శక్తి చాముండేశ్వరి కి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సారె సమర్పణ చేయడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలు (సారె)ను తీసుకుని అమ్మవారి ఆలయం వద్దకు వచ్చారు. చాముండేశ్వరికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తీసుకొచ్చిన సారెను సమర్పించారు. తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తల్లి చెవిరెడ్డి లక్ష్మీ, సోదరుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి దగ్గరుండి అమ్మవారికి సారెను అందించారు. తుమ్మల గుంట నుంచి తీసుకు వచ్చిన సారెకు అమ్మవారి ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సారె తెచ్చిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి వేద పండితుల ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మట్లా డుతూ జక్కదొక సమీపంలో అందిన సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుమందిని గుర్తించి ముగ్గురుని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారైయ్యారని వివరించారు. వీరి నుంచి రూ.19,500స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీటిగుంటలో పడి గొర్రెలు కాపరి మృతి

- మృతదేహన్ని వెలిక తీసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రమాదవశాత్తు నీటి గుంటలో గొర్రెల కాపరి పడి మృతి చెందిన సంఘటన ఆది వారం మండలంలో చోటుచేసుకునింది. సమాచారం అందుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మృతదేహన్ని వెలికి తీశారు. అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు వివరాలను తెలిపారు. మండలంలోని చదళ్ళ గ్రామానికి చెందిన కృష్ణప్ప(80) గొర్రెల కాపరి. జీవాలను నీటిలో కడిగేందుకు తీసుకెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికి తీసినట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయాలపాలైయ్యాడు. సోమల గ్రామానికి చెందిన సుధాకర్(38) బైక్‌పై ఆంజనేయస్వామి గుడికి బయలుదేరాడు. ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పింది కింద పడిపోయింది. దీంతో సుధాకర్‌కు గాయాలైయ్యాయి. స్థానికులు సోమల ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో 108లో సదుంకి తరలించారు. అందుబాటులో లేని సోమల వైద్యాధికారుల తీరు పట్ల ఎంఆర్‌పిఎస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు.

ఎస్‌వియూ కావలి పిజి సెంటర్ పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వి యూనివర్సిటీ పీజీ సెంటర్, కావలి లో ఎంఎస్ సి ఫిజిక్స్ చదివిన 1993-95 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తిరుపతి పట్టణంలో 30 సంవత్సరాల తరువాత ఎస్వీయూలో శనివారం కలిశారు. ఈ కార్యక్రమంలో కావలి పిజి సెంటర్‌కు సంబంధిం చిన ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ ఎన్ ప్రభాకర్‌రావు, ప్రొఫెసర్ వైసి రత్నాకరం పాల్గొని అప్పటి విషయాలు గురించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపకులపతి ఆచార్య ఎన్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కృషి, పట్టుదలతో తమ లక్ష్యాలను చేరుకుని విజయం సాధించడం పట్ల గురువుగా ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్ర రంగంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ రంగాలలో ఉన్నత స్థితిలో స్థిరపడిన తమ విద్యార్థులను చూసి గర్వపడ్డారు. పిజి సెంటర్ పూర్వపు విద్యార్థి, ప్రస్తుత ఎస్వీ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు సమక్షంలో తమ గురువులను శాలువాలు , పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.